




	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	37	24
భద్రాద్రి	37	23



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సా) : 6:26 (శనివారం)

సహర్ (ఉ) : 4:50 (ఆదివారం)



రామయ్యా.. వస్తున్నామయ్యా..

- అశ్వారావుపేట నుంచి పాదయాత్రగా బయలుదేరిన రామభక్తులు
- మూడు రోజులు.. 100 కిలోమీటర్లు...
- 40 మంది బృందంగా పయనం

అశ్వారావుపేట పట్టణంలోని జంగారెడ్డి గూడెం రోడ్ గల షిర్డిసాయిబాబా ఆలయం నుంచి భక్తులు శుక్రవారం భద్రాచలంలోని రాములవారి సన్నిధికి పాదయాత్ర చేపట్టారు. గత 9 ఏళ్ల నుంచి సాయి భక్తులు భద్రాచలానికి పాదయాత్రగా వెళుతున్నారు. ఈ ఏడాది కూడా దాదాపు 40మంది భక్తులు సాయి ఆలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామ జపం చేస్తూ పాదయాత్ర చేపట్టారు. మూడురోజుల పాటు దాదాపు 100కిలో మీటర్ల మేర యాత్ర నిర్వహించి రాములోరి సన్నిధికి చేరనున్నారు. పాదయాత్ర చేపట్టిన భక్తులకు గ్రామాల్లో పలువురు స్వాగతం పలికారు. లోకకల్యాణార్థమే ప్రతిఏటా చిన్న తిరుపతి, భద్రాచలానికి పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పంబి హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో అప్పారావు, వెంకటేశ్వరరావు, శ్రీదేవి, సూరిబాబు, రమాదేవి, మల్లిక, స్వప్న, శాంతి, సంజు, శ్రీనుతోపాటు పలువురు పాల్గొన్నారు.

- అశ్వారావుపేట రూరల్



సీతారాముల కల్యాణానికి రారండి...

- చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సహా పలువురు అధికారులకు ఆహ్వానం
- హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రికలు అందజేసిన భద్రాద్రి ఆలయ అధికారులు

భద్రాచలంలో ఏప్రిల్ 17న శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వహించనున్న సీతారామచంద్రస్వామి కల్యాణానికి రావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావును భద్రాద్రి దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. హైదరాబాదులోని వారి కార్యాలయాల్లో దేవస్థానం ఈవో రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకుడు కోటి రామ స్వరూప్ రాఘవాచార్యులు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ రవీంద్రనాథ్ తదితరులు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఈవో రమాదేవి వైదిక సిబ్బంది ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. అలాగే సీఎంవో కార్యాలయంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు శేషాద్రి, మాణిక్‌రాజ్‌లతోపాటు ఇతరులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

-భద్రాచలం

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఉంది అధికారుల తీరు. పేదలకు పెద్ద దిక్కుగా వున్న ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలకు రాష్ట్ర అధికారులు మంగళం పాడారు. దీంతో కీలక విభాగాల్లో వైద్యులు లేక సేవలు నిలిచి పోతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీదైన వైద్యాన్ని కొనలేక రోగులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ట్రామా, డయాలసిస్ సేవలు అందించే విభాగాల్లో వైద్యులు లేకపోవడం శాపంగా మారింది. కీలకమైన న్యూరో, యూరాలజీ, నెఫ్రాలజీ సూపర్ సేవల పోస్టులను రద్దు చేయాలని డీఎంఈ ఆదేశాలు ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సూపర్ సేవలు గోవిందా!

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో కీలక విభాగాలకు వైద్యుల కరువు

- సేవలు అందక సామాన్యుల ఇబ్బందులు
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక రోగాలతో పోరాటం
- సూపర్ స్పెషలిస్టుల పోస్టులను రద్దు చేయడంపై విమర్శలు
- వెలవెలబోతున్న ట్రామా, డయాలసిస్ విభాగాలు
- 101 పోస్టులకుగాను 38మాత్రమే భర్తీ
- నామమాత్రంగా మారుతున్న వైద్యశాల

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 22: జిల్లా ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, సర్జన్‌తోపాటు అనస్తీషియా, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఫ్యామిలీ ప్లానింగ్, కంటి విభాగం, డెంటిస్ట్, ఫిజియోథెరపీ, పిడియాట్రిక్, పల్మనాలజీ, విభాగాలకు వైద్యులు ఉన్నారు. 100మందికి పైగా వైద్యులు, సీనియర్ రెసిడెన్స్ వైద్యులు 25మంది, డీఆర్పీలు మరో 24మంది విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్ కింద జిల్లా ఆస్పత్రిలో న్యూరో, గుండె, యూరాలజీ, నెఫ్రాలజీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంతేకాదు కార్డియాలజీ విభాగం అందుబాటులోకి వచ్చిన తర్వాత జిల్లా ఆస్పత్రికి మంచిపేరు లభించింది. రూ.7కోట్లతో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఎంతోమంది నిరుపేదలకు టూడీ ఎకో, యాంజియోగ్రామ్, స్టెంట్లు వేశారు. పేస్‌మేకర్స్ లాంటి కీలకమైన వైద్య సేవలు అందాయి. రోజుకు కనీసం 70మంది రోగులు ఈ విభాగానికి వచ్చే వారు. కానీ ఇటీవలె ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడు డాక్టర్ సీతారామ్‌నాయక్ డిప్యుటేషన్ రద్దుచేసి కరీంనగర్‌కు పంపించారు. అయితే కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవతో తిరిగి ఆ వైద్యుణ్ని ఇక్కడకు రప్పించి వైద్యులకు కార్డియాలజీ సేవలను పునరుద్ధరింపజేశారు.

ఆస్పత్రిలో గతంలో న్యూరాలజీ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి మంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు ట్రామాకేర్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. కానీ మెడికల్ కళాశాలగా రూపాంతరం చెందిన తర్వాత ఆ విభాగాన్ని రద్దు చేశారు. దీంతో న్యూరో స్పెషలిస్టుకు వేతనాన్ని అతి తక్కువగా ఇవ్వడంతో ఆయన సేవలు అందించేందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రతి నిత్యం ఇక్కడ 100మంది రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జీబీఎస్ లాంటి ప్రమాదకరమైన వ్యాధికి కూడా ఇక్కడ న్యూరో విభాగంలో చికిత్సలు అందించారు. దీంతో ఇక్కడి విభాగానికి మంచి పేరు వచ్చింది. కానీ ప్రస్తుతం ఆ విభాగాన్ని రద్దు చేశారు.

- కిడ్నీ సంబంధిత సేవలు కూడా మూలనపడ్డాయి. కిడ్నీ వైద్యుడు వేణుగోపాల్‌ను యూరాలజీ విభాగంలో డాక్టర్ రాఘవేంద్ర రావును కూడా తొలగించారు. దీంతో ఈ విభాగాల్లో సేవలు అందక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్ రోగులకు తీరని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యులు లేకపోవడంతో డయాలసిస్ రోగులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఇప్పటి వరకు 50మందికి పైగా రోగులు మృతిచెందారు. ఇలాంటి కీలకమైన విభాగాలకు వైద్యులు లేకపోవడం వాటిని మూసేయడంతో రోగులు వచ్చి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక పోతున్నారు.
- ఇటీవలె కాంట్రాక్టు పద్ధతిలో వైద్య, విద్య రాష్ట్ర ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడాది పాటు విధులు నిర్వహించేందుకు అన్ని విభాగాలకు కలిపి 101పోస్టులను భర్తీ చేయాలంటూ మార్చి 13న నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో వైద్యులు పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు వస్తారని భావించారు. కానీ ఒక రోజు వ్యవధి రావడం ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో హడావిడిగా పోస్టులను భర్తీ చేశారు. మొత్తం 66మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలోనూ నిబంధనల పేరుతో 38మందిని మాత్రమే ఎంపిక చేశారు. వీటిలో కీలకమైన న్యూరో, యూరాలజీ, నెఫ్రాలజీ సూపర్ సేవలకు పోస్టులను రద్దు చేయాలని డీఎంఈ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో అధికారికంగానే ఆ సేవలకు మంగళం పాడినట్లైంది.

పూర్తిస్థాయిలో వైద్యులు భర్తీ కాకపోవడంతో వివిధ విభాగాల్లో హెచ్‌వోడీలకు పనిభారం పెరిగిపోయి ఎస్సార్‌లపై వదిలిపెట్టి వెళ్తున్నారు. దీంతో ఓపీ విభాగాల్లో రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవలె ఓ ఎస్సార్ రాసిన మందులు, అక్కడి స్టాఫ్ నర్సులు రోగికి వేసిన మాత్రలవల్ల ఇన్‌పేషెంట్‌గా ఉండి చికిత్స పొందుతున్న రోగి మృత్యువాత పడ్డాడు. దీంతో రోగి బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల తర్వాత నోటిఫికేషన్ ఇస్తాం

డాక్టర్ రాజేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 101 వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఒక్క రోజే గడువు కారణంగా దరఖాస్తులు పూర్తి స్థాయిలో రాలేదు. ఇంకా కొన్ని జిల్లాల్లో నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. కలెక్టర్ సూచన మేరకు 15లోగానే నియామకాలు చేపట్టాం. ఇప్పటికే 38మందిని ఎంపిక చేశాం. ఎన్నికల తర్వాత మరో మారు నోటిఫికేషన్ ద్వారా అన్ని విభాగాలకు వైద్యులను భర్తీ చేస్తాం. న్యూరో, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలకు అనుమతి లేదని డీఎంఈ నుంచి ఆదేశాలు వచ్చాయి. భవిష్యత్తులో వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నాం.

మోదీ పతనం షురూ

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు అక్రమం
- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పక్షాల నేతలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 22: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేయటం ప్రధాని నరేంద్ర మోదీ ఓటమికి నాంది అని పలురాజకీయ పార్టీల నేతలు వ్యాఖ్యానించారు. అరెస్టు ఘటనపై శుక్రవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఇండియా కూటమి, ఆప్ పార్టీల నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆప్ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ నేత నల్లమోతు తిరుమలరావు మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ కుంభకోణం మోదీ అబద్ధాల ఫ్యాక్టరీలో తయారైన కట్టుకథగా కొట్టి పారేశారు. 2015నుంచి ప్రధాని మోదీ కేజ్రీవాల్ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ అవినీతిని కప్పి పుచ్చుకోవటానికి ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను ప్రయోగిస్తోందన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ మాట్లాడుతూ మత ఛాందస మోదీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం అనే మాటకు అర్థం మారిపోతుందన్నారు. ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేసిందని, ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టిందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు జితేంద్రరెడ్డి మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన బీజేపీ రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి నగర అధ్యక్షుడు జంగిపల్లి రవి, సీపీఐ ఎంఎల్ ఎన్డీ జిల్లా నాయకుడు ఎస్కే ఖాసీం, ఆప్ జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.



మంత్రి తుమ్మల వాహనం తనిఖీ

మధిర, మార్చి 22: రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రయాణిస్తున్న కారును ఖమ్మం జిల్లా మధిరలో పోలీసులు తనిఖీ చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైరా నుంచి మధిర మీదుగా వెళ్తుండగా పార్లమెంట్ ఎన్నికల నిబంధనల్లో భాగంగా మధిర చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీ చేశారు. అయితే మంత్రి వాహనంలో వారికి ఏమీ లభ్యం కాలేదు.

నగరంలో చైన్ స్నాచింగ్

ఇద్దరు మహిళల మెడలో గొలుసుల చోరీ

ఖమ్మం క్రైం,మార్చి22: వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనలు శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారథినగర్‌కు చెందిన ఏపూరి పద్మ శుక్రవారం రాత్రి వాకింగ్ చేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చింది. అదే సమయంలో ఓ ద్విచక్రవాహనంపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి మెడలోని బంగారు గొలుసును లాక్కున్నారు. అయితే వెంటనే ఆమె గొలుసును గట్టిగా పట్టుకోవడంతో గొలుసులోని కొంత ముక్క చేతిలో ఉండిపోయింది. చోరీకి గురైన గొలుసు విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని, బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మామిళ్లగూడెంలోని ఓ కిరాణా దుకాణం వద్దకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి షాపులో ఉన్న మహిళను బిస్కెట్లు కావాలని అడిగారు. ఆమె బిస్కెట్లు ఇచ్చే క్రమంలో మెడలోని ఆరు గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

దళారుల ప్రమేయం లేకుండా అనుమతులు

టీఎస్ బీ-పాస్‌పై కలెక్టర్ సమీక్ష



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 22: టీఎస్ బీ-పాస్ విధానం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ అనుమతులు ఇస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 13 దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు సమర్పించిన వాటికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లే-అవుట్ల అనుమతులను నిర్ణీత గడువులోగా నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని అక్కడ మొక్కలు నాటాలన్నారు.

కింకర్తవ్యం..!

- లోక్‌సభ ఎన్నికల వేళ డోలాయమానంలో టీడీపీ శ్రేణులు
- తాజా ఎన్నికల్లో ఏపీలో బీజేపీతో జతకట్టిన టీడీపీ
- తెలంగాణలోనూ పొత్తుపై అస్పష్టత
- పొత్తు ఉంటే ఖమ్మం సీటు కేటాయించాలి..
- బాబు నిర్ణయం కోసం టీడీపీ నేతల నిరీక్షణ



ఖమ్మం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా కాంగ్రెస్ విజయమే ధ్యేయంగా పనిచేసిన తెలుగుదేశం పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో రూటు మార్చబోతోంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్డీఏలో చేరడంతో టీడీపీ జిల్లా నేత లు ఆత్మ పరిశీలనలో పడ్డారు. పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని బట్టి నడుచుకోనున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నియోజకవర్గాల వారీ గా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ నేతలు అడుగులు వేస్తున్నారు. జాతీయ స్థాయిలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా మారి పొరుగున ఉన్న ఏపీలో కలిసి పోటీచేస్తున్నాయి. అయితే తెలంగాణ విషయంలో బీజేపీకి టీడీపీతో సఖ్యత లేదు. ఇప్పటివరకు టీడీపీ, జనసేన నేతలతో ఎక్కడా ఉమ్మడి సమావేశాలు పెట్టడం కాని, బీజేపీ సభలు, సమావేశాల్లో టీడీపీ జెండాలు కూడా కనిపించడం లేదు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో జనసేన, బీజేపీ కలిసి పోటీచేసినా పెద్దగా ఓటుబ్యాంకు సాధించలేదు. అయితే కాంగ్రెస్ విజయం, మెజారిటీలో మాత్రం టీడీపీ కేడర్ చురుగ్గా పనిచేయడమే కాకుండా బీఆర్ఎస్‌ను ఓడించి తీరుతామని కార్యకర్తలు ప్రతీ సమావేశంలో పట్టుదలతో పనిచేశారు. రాహుల్, ప్రియాంకగాంధీ సభలు, రోడ్‌షోలలో కాంగ్రెస్ కంటే పసుపు జెండాలు అధికంగా రెపరెపలాడాయి. ఒకనాడు కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అన్న టీడీపీ.. రాష్ట్ర విభజన తర్వాత ఓటమి చెందింది. 2009లో ఖమ్మం నియోజకవర్గంతోపాటు మూడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో టీడీపీ గెలవగా కొన్ని నియోజకవర్గాల్లో 5 నుంచి 10 వేల ఓట్ల తేడాతో అభ్యర్థులు ఓడిపోయారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్, టీడీపీలు 2014 వరకు నువ్వా నేనా అన్నట్టుగా ఎన్నికల్లో ఢీకొన్నాయి. 2014లో కూడా ఖమ్మం లోక్‌సభలో టీడీపీ కేవలం 10వేల ఓట్ల తేడాతోనే ఓటమి చెందింది.

2018లో కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు నువ్వా నేనా అన్నట్టు ఢీకొన్నాయి. ఆ తర్వాత గత అసెంబ్లీ ఎన్నికల తరుణంలో టీఆర్ఎస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులంతా కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్‌కు ఉన్న బలంతోపాటు అదనంగా ఓటుబ్యాంకు తోడైంది. టీడీపీ కూడా కాంగ్రెస్‌కే జై కొట్టడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రతి నియోజకవర్గంలోనూ ఊహించని విధంగా భారీ మెజారిటీలు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్, టీడీపీల మైత్రిబంధం పరోక్షంగా సాగుతోంది.

అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏపీ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్, వామపక్షాలు ఏపీలో కలిసి పోటీ చేస్తుండగా తెలంగాణలో కాంగ్రెస్, సీపీఐ మాత్రమే కలిసి పోటీలో ఉన్నాయి. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేనలు కలిసి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో కలిసి పోటీ చేస్తుండడంతో తెలంగాణ లోక్‌సభ ఎన్నికలపై కూడా ఈ ప్రభావం పడనుంది. ఖమ్మం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిని బట్టి టీడీపీ ఓటుబ్యాంకు క్రాస్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

తెలంగాణ టీడీపీపై రాష్ట్ర నాయకత్వం గత ఎన్నికల్లో వలే ఆత్మ పరిశీలనతో ఓటు వేయాలని పిలుపునిస్తే అప్పుడు అసెంబ్లీ ఎన్నికల వలే కాంగ్రెస్‌కు అనుకూలంగా బహిరంగంగా తిరిగే అవకాశం ఉంది. కొందరు టీడీపీ నాయకులు మాత్రం బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులు తెలంగాణలో కూడా అధికారికంగా ఉంటే ఖమ్మం లోక్‌సభ టికెట్‌ను టీడీపీకి కేటాయించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.



పాఠశాలలకు కొత్త కళ

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు
- మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం
- నిర్వహణ బాధ్యతల్లో మహిళలకే ప్రాధాన్యం
- 665 పాఠశాలలకు రూ.16.61 కోట్లు

7

గొరిల్లా వేషం.. కోతులు పరార్..

- భద్రాద్రి జిల్లా మోరంపల్లి బంజర గ్రామంలో తీవ్రంగా కోతుల బెడద
- అరికట్టేందుకు పంచాయతీ సెక్రటరీ వినూత్న ఆలోచన



7

ఎన్నికల కోడ్‌పై అవగాహన ఉండాలి

● అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



లే అవుట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సత్తుపల్లిరూరల్, మార్చి22: ఎన్నికల కోడ్‌పై ముందుగా ఉద్యోగులు అవగాహన చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మునిసిపాలిటీ, మండల పరిధిలోని పలువురు దరఖాస్తు చేసుకున్న లే అవుట్లను పరిశీలించారు. స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్ రోడ్డులో, మండలంలోని కాకర్లపల్లిలోని లేఅవుట్లను పరిశీలించి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఎలాంటి చిత్రపటాలు, హోర్డింగ్‌లు ఉన్నా తొలగించాలని అన్నారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తరచూ పరిశీలించాలన్నారు. కోడ్ అమలులో ఉద్యోగులు ఎలాంటి రాజీ ధోరణి ప్రదర్శించరాదని, కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

పాల్వంచ, మార్చి 22 : పాల్వంచ పట్టణ పరిధిలోని ఇందిరాకాలనీ, హమాలీ కాలనీల్లోని రెండు బెల్టు షాపుల్లో పాల్వంచ పట్టణ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.10వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఇద్దరు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పాల్వంచ టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.

కామేపల్లి పీఏసీఎస్ కార్యవర్గం ఎన్నిక



నూతన వైస్ చైర్మన్ రాంబాబును అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి, మార్చి 22: కామేపల్లి పీఏసీఎస్ తాత్కలిక చైర్మన్, వైస్ చైర్మన్‌గా పింజరమడుగు గ్రామానికి చెందిన గుజ్జర్లపుడి రాంబాబును ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల అధికారి రవికుమార్ అధ్యక్షతన జరిగి న సమావేశంలో 11మంది డైరెక్టర్లు సమక్షంలో వైస్ చైర్మన్‌గా గుజ్జర్లపుడి రాంబాబును ఎన్నుకున్నారు. అదే విధంగా నూతన చైర్మన్ ఎన్నుకునేంత వరకు తాత్కలిక చైర్మన్‌గా బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, కరుణ, యాదగిరి, జేత్రాం, పెంట్యా ఉన్నారు. నూతన వైస్ చైర్మన్ గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి మహేందర్, వెంకటనర్సయ్య, రాజేష్, దొడ్డ వేణు తదితరులు అభినందించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్, మార్చి22: పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని ఇల్లెందు ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి ప్రసన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మామిడిగుండాల గ్రామంలో పోషణపక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు విజయ, సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, చంద్రకళ, ఉమా, వీరభద్రమ్మ, రేణుక తదితరులున్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

పెనుబల్లి, మార్చి 22: లంకపల్లి శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు వీఎంబంజర్ ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్దనుంచి రూ.4వేల నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

మధిర, మార్చి 22: మధిర రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి 20 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపర్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మధిర అవుట్ పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఎవరైనా ఈఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తుపడితే 87125 8589, 8712658607 నెంబర్లకు తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు.

భార్య రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య



శోభన్‌బాబు

కరకగూడెం, మార్చి 22: భార్య రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కలవలనాగారం గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేలోత్ శోభన్‌బాబు(38) అశ్వాపురం మండలం తూరుమూలగూడెం గ్రామానికి చెందిన సునీతతో కొన్నేళ్ల క్రితం వివాహం అయ్యింది. కాగా ఇటీవల కుటుంబ తగాదాలు జరుగుతుండడంతో రెండు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురైన అతడు గురువారం పురుగుల మందు తాగాడు. గమనించి కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి సక్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

నాటుసారాను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తల్లాడ, మార్చి 22: అక్రమంగా నాటుసారా సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వైరా ఎక్సైజ్ సీఐ మమత తెలిపిన వివరాల ప్రకారం.. మండలం మల్సూర్‌తండా వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలో కల్లూరు మండలం రాళ్లబంజర గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్న రాళ్లబంజర గ్రామానికి చెందిన కె.కృష్ణ, డి.రాము అనే వ్యక్తుల నుంచి 11 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్ ఎదుట ఇరువురిని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సాయి రాం, రతన్‌ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది సీతారాం, రవి, నాగేశ్వరరావు, శ్రావణ్ పాల్గొన్నారు.

రూ.17లక్షల గంజాయి పట్టివేత

భద్రాచలం ఏప్రిల్ 22: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. బొలెరో వాహనంలో సుమారు 32 ప్యాకెట్లలో గంజాయిని తరలిస్తున్న నేపథ్యంలో అనుమానం వచ్చిన పోలీసులు వాహనం ఆపి తనిఖీ చేయగా 66 కేజీల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.17 లక్షల ఉండొచ్చని సమాచారం. గంజాయితోపాటు బొలెరో వాహనాన్ని సీజ్ చేసి రవాణా చేస్తున్న సిద్దిపేటకు చెందిన కోటగిరి గణేష్‌ను పోలీస్‌లు స్టేషన్‌కి తరలించారు. ఈ గంజాయిని హైదరాబాదులో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ గౌతమ్



కూసుమంచి చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

కూసుమంచి, మార్చి 22: చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.పి గౌతమ్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ ఏర్పాట్లు వాహనాల తనిఖీ రిజిస్టర్లను పరిశీలించారు. పటిష్ఠ నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగదు, మత్యం రవాణాను నియంత్రించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది విధులు, నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతివాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీ సంబంధించిన రిజిష్టర్‌లో ఏవాహనం, నెంబరు, నమోదు చేయాలన్నారు. ప్రతిచెక్‌పోస్టులో వీడియోగ్రఫీకి తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ 24గంటలు నిఘా పెట్టాలన్నారు. ఎన్డీసీ రాజేశ్వరి, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన శిక్షణ కలెక్టర్లు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి22: జిల్లా జనరల్ ఆస్పత్రిని శుక్రవారం శిక్షణ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్ సందర్శించారు. ఈసందర్భంగా వారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ అమర్‌సింగ్, కిరణ్‌కుమార్ తదితరులు ఆస్పత్రిలో విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ నమోదు, వివిధ విభాగాల్లో వైద్యులు రోగుల పరిశీలిస్తున్న అంశాలను వారు పరిశీలించారు.



జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న శిక్షణ కలెక్టర్లు

ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు

● సమగ్ర వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్

చింతకాని, మార్చి 22: ఆరుతడి పంటల సాగుతో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందవచ్చని సమగ్ర వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ సైంటిస్టు గోవర్ధన్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వానాకాలం వరి పంట అనంతరం యాసంగి పంటలో జీరో టిల్లేజ్ పద్ధతిన మొక్కజొన్న సాగు చేయడం రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. జీరో టిల్లేజ్ పద్ధతి సాగుకు పెట్టుబడులు తక్కువని, చీడ పీడల ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. నీటి సదుపాయం అందుబాటులో ఉన్న చోట మొక్కజొన్న సాగు, తక్కువ నీరు ఉన్న చోట అపరాల సాగు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జేడీఏ విజయనిర్మల, ఉమారెడ్డి, ప్రగతి కుమారి, భరత్, రవికుమార్, చిరంజీవి, నాగస్వాతి పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి: అడిషనల్ ఏపీడీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ శిరీష

ఏన్కూరు మార్చి 22: ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ ఏపీడీ శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని పీకే బంజర, రాజలింగాల, ఏన్కూరులో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు . ప్రస్తుతం ఉన్న 2600 మంది కూలీల సంఖ్యను 5వేలకు పెంచాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించాలని, మొక్కలకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ వెంకటపతి రాజు, ఏపీవో చిత్తలూరు సూరయ్య పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోలీస్ క్రీడల్లో ఏసీపీ వెంకట్రావు ప్రతిభ



పతకం సాధించిన వెంకట్రావు (సర్కిల్‌లోని వ్యక్తి)

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 22: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈనెల 17 నుంచి 22 వరకు జరిగిన 16వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏసీపీ ఘంటా వెంకట్రావు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీసు అకాడమీలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన 55 ప్లస్ ఏజ్ గ్రూప్‌లో మెన్స్ సింగిల్స్, డబుల్స్ విభాగాలలో రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఈసందర్భంగా పతకాలు సాధించిన వెంకట్రావును జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఉప్పల్‌రెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్ పలువురు క్రీడాకారులు అభినందించారు.

భద్రాచలానికి భక్తబృందం పాదయాత్ర



భద్రాచలానికి పాదయాత్రగా బయలుదేరిన భక్తబృందం

కల్లూరు, మార్చి 22 మండలంలోని పుల్లయ్యబంజరు గ్రామం నుంచి శుక్రవారం భక్త బృందం పాదయాత్రగా భద్రాచలానికి బయలుదేరి వెళ్లారు. వారం రోజుల నుంచి భద్రాచలం సీతారాయుల వారి కల్యాణానికి గోటితో వలసిన కోటి తలంబ్రాలు సమర్పించేందుకు పుల్లయ్య బంజరుకు చెందిన 100 మంది భక్తులు కాలినడన ఈ యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ భక్తులు కిష్టంశెట్టి నరిసింహారావు, పసుపులేటి సుబ్బారావు, బుర్రి వెంకటరామారావు, కృష్ణమాచారి, వాసిని కిషోర్, నర్సయ్య, వంగల శ్రీనివారావు తండు లక్ష్మణరావు ఉన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీతయ్య



సీతయ్యను అభినందిస్తున్న మహిళలు

కామేపల్లి, మార్చి 22: తెలంగాణ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ముచ్చర్ల గ్రామానికి చెందిన రాయల సీతయ్యను నియమిస్తూ నేషనల్ చైర్‌పర్సన్ ఉన్నం జ్ఞాన సుందరి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు నియాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతానని అన్నారు. ఆపదలో ఉన్న వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

కొమరారంలో నకిలీ విత్తనాలపై విచారణ

» పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు » డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఇల్లెందురూరల్, మార్చి22: నకిలీ విత్తనాలతో పంటలు నష్టపోయామని ఇటీవల మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. కాగా ఈ విషయమై ఈనెల 16న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో నిండా ముంచిన నకిలీ విత్తనాలు అనే కథనం ప్రచురించిన విషయం విధితమే. ఈ కథనానికి స్పందించిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల వరి పొలాలను పరిశీలించారు. గ్రామంలో సాగు చేస్తున్న రైతుల వివరాలు, పంట ఎదుగుదల లేకుండా ఉన్న వరి పొలాలను పరిశీలించి, రైతులు ఉపయోగించిన విత్తనాలను, పురుగు మందులను, ఎరువులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు, వ్యవసాయశాఖ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. తూతూమంత్రంగా అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారని, రైతులకు న్యాయం జరగదని ఆరోపించారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై, కంపెనీపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే విత్తనాలు అమ్మిన డీలర్లకు నోటీసులు అందించామని అధికారులు తెలిపారు. నకిలీ విత్తనాలే అని నిర్ధారణ జరిగితే చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు నచ్చజేప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, రవి, ఏడీఏ వాసవి రాణి, ఏవో సతీష్, రైతులు ఉన్నారు.

13 వాహనాలపై కేసులు

ఖమ్మంక్రైం, మార్చి 22: నెంబరు ప్లేటు లేకుండా, నెంబరు ప్లేటు పై ఉన్న నంబర్లు తొలిగించి నగరంలో తిరుగుతున్న 13 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపై నడుస్తున్న వాహనాలపై శుక్రవారం నగరంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పలు కూడళ్లలో నెంబరు ప్లేటు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి ఖమ్మం వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్ పోలీసుస్టేషన్లకు తరలించినట్టు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

దుమ్ముగూడెం, మార్చి 22: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీఐ అశోక్ గురువారం రాత్రి పట్టుకున్నారు. చర్ల మండలం ఆర్‌కొత్తగూడెం నుంచి మండలంలోని పెదబండిరేవుకు ఇసుక రవాణా చేస్తున్న సందర్భంలో పెట్రోలింగ్‌కు వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఖమ్మం రూరల్, మార్చి 22: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పల్లెగూడెం గ్రామానికి చెందిన బత్తిని నిఖిల్ (22) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నిఖిల్ ఖమ్మం పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి నిఖిల్‌ని నిరాకరించడంతో మనస్థాపానికి గురైన అతడు ఈనెల 11న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

నేలకొండపల్లి, మార్చి22: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీ జరిగిన సంఘటన శుక్రవారం నేలకొండపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టి కమలమ్మ అనే మహిళ కోదాడ బస్టాండ్‌లో నేలకొండపల్లి వెళ్లే బస్సు ఎక్కింది. నేలకొండపల్లిలో బస్సు దిగే సమయంలో తన వద్ద బ్యాగును చూసుకోగా బ్యాగులో ఉండాల్సిన 4తులాల నల్లపూసల గొలుసు, 3తులాల చంద్రహారం కనపడలేదు. వాటి విలువ దాదాపుగా రూ.1.80 లక్షలుంటుందని, కోదాడ నుంచి తన పక్కనే కూర్చున్న గుర్తు తెలియని మహిళ దొంగిలించి ఉంటుందని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమహిళ కూడా నేలకొండపల్లి బస్టాండ్‌లోనే దిగిందని పేర్కొన్నారు. ఎస్‌ఐ తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దమ్మపేటలో.....

దమ్మపేట, మార్చి22: దమ్మపే టలోని మోడల్‌కాలనీకి చెందిన నల్లగట్ల కల్పన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లింది. కాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాతో సహా పొలాల్లోకి తీసుకెళ్లారు. బీరువా పగలగొట్టి చూడగా అందులో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి: డీఈవో

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 22: పోలింగ్ బూత్‌లుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయం నుంచి జిల్లాలోని 379 మంది ప్రధానోపాధ్యాయులు సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లోని వసతుల పై ప్రధానోపాధ్యాయులు ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పన విషయంలో స్థానిక అమ్మ ఆదర్శ కమిటీలను సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, స్విచ్చులు, బల్బులు, తదితర రూ. 25వేల లోపు పనులకు ఇంజనీర్ ఎస్టిమేట్, మెజరమెంట్ బుక్ అవసరం లేదన్నారు. అంతకన్నా పెద్ద పనులకు ఎస్టిమేషన్స్ మాత్రం రూపొందించాలన్నారు.

ఉన్నత చదువుతోనే మెరుగైన అవకాశాలు

● స్కార్లెట్ ఈబీస్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ సంస్థ డైరెక్టర్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

అశ్వారావుపేట రూరల్, మార్చి 22: ఉన్నత చదువుతో మెరుగైన అవకాశాలు ఉం టాయని స్కార్లెట్ ఈబీస్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ సంస్థ డైరెక్టర్ బి.రవి, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ పుతిన్‌లు అన్నారు. శుక్రవారం అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో స్కార్లెట్ ఇబిస్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ సంస్థ ద్వారా విద్యార్థులకు నిర్వహించిన విదేశీ విద్యపై అవగాన, శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీ, ఎస్సీ సెల్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు, ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పార్కింగ్

» తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

» పట్టించుకోని అధికారులు

సత్తుపల్లిరూరల్, మార్చి22: సత్తుపల్లి పట్టణంలో ప్రధాన రహదారులన్నీ పార్కింగ్‌కు అడ్డాలుగా మారాయి. వాహనదారులు అంతర్గత రహదారులలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్‌కు కూడా తరచూ అంతరాయం కలుగుతుంది. అనేకమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పాటు వాహనాల సంఖ్య సైతం ఏటేటా పెరుగుతూ వస్తోంది. క్రయవిక్రయాల నేపథ్యంలో వందల మంది ద్విచక్ర వాహనాలతో సత్తుపల్లి పట్టణానికి వస్తుంటారు. గంటల తరబడి వాహనాల పార్కింగ్‌తో దుకాణదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. 90శాతానికి పైగా వ్యాపార వాణిజ్య సంస్థలు పార్కింగ్ స్థలాలు లేకుండా నిబంధనలు మీరి వ్యాపారాలు సాగిస్తున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు ట్రాఫిక్ నియంత్రణలో చర్యలు తీసుకున్నప్పటికీ.. ఇటీవల మళ్లీ అధికారుల ఉదాసీనతతో పరిస్థితి యథావిధిగా మారిందని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాహనాల పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కళాభారతి రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

వృథాగా తాగునీరు

» నీటికోసం అల్లాడుతున్న ప్రజలు

» పైపులైన్ లీకేజీతో పొలాల్లో ప్రవహిస్తున్న నీరు

తల్లాడ, మార్చి 22: పైపులైన్ లీకేజీతో మిషన్ భగీరథ మంచినీరు పొలాల్లో వృథాగా ప్రవహిస్తుంది. సరిపడా తాగునీరందక ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. తల్లాడ మండలంలోని ముద్దునూరు గ్రామం నుంచి కుర్నవల్లి గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీల కారణంగా తాగునీరు వృథా అవుతుంది. రోజుల తరబడి మిషన్ భగీరథ నీళ్లు పొలాల్లో వృథాగా ప్రవహిస్తున్నాయి. దీంతో కుర్నవల్లి గ్రామానికి సరిపడా తాగునీరు సరఫరా కాకపోవడంతో నిత్యం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల తాగునీరు వృథా అవుతున్నప్పటికీ పట్టించుకొనే వారే కరువయ్యారు. వేసవి దృష్ట్యా ఒకవైపు తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ లీకేజీల నివారణ, సక్రమంగా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వృథాగా ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

శాఖమూరిపై రౌడీషీట్‌ను కొట్టేసిన హైకోర్టు

నేలకొండపల్లి, మార్చి22: అప్పటి బీఆర్ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్‌పై నేలకొండపల్లి పోలీసులు పెట్టిన రౌడీషీట్‌ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పునిచ్చినట్లు శాఖమూరి రమేష్ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. గతంలో బీఆర్ఎస్‌లో మండలంలో తుమ్మలకు ప్రధాన అనుచరుడిగా కొనసాగిన అయనపై బీఆర్ఎస్‌కే చెందిన తాజా మాజీ పాలేరు శాసనసభ్యుడి ఒత్తిడితో నేలకొండపల్లి పోలీసులు రౌడీషీట్‌ను తెరిచారు. ఒకే పార్టీలో కొనసాగుతున్నప్పటికీ తుమ్మల వర్గంలో కొనసాగుతున్నాడన్న కక్షతో రాజకీయ కారణాలతో అతనిపై రౌడీషీట్‌ను తెరిచారని అప్పట్లో ప్రచారం జరిగింది. తనపై రౌడీషీట్‌ను తెరవటాన్ని సవాల్ చేస్తూ రమేష్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరిగిన అనంతరం అతనిపై రౌడీషీట్‌ను కొట్టేస్తూ హైకోర్టు గురువారం తీర్పునిచ్చినట్లు సమాచారం

ఎడతెగని ఉత్కంఠ

- రెండో జాబితాలోనూ ఖరారు కాని టికెట్
- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో తీవ్ర పోటీ
- సర్వేలు, సమీకరణాలతో తుది కసరత్తు

ఖమ్మం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండో జాబితాను కూడా కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినప్పటికి ఖమ్మం అభ్యర్థి వ్యవహారం ఎటూ తేలలేదు. చివరి వరకు నిర్ణయం తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కేడర్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోనే కీలకంగా మారిన ఖమ్మం కేండిడేట్ ఎంపిక అధిష్ఠానానికి సవాల్‌గా మారింది. జిల్లా రాజకీయ సమీకరణాలు, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సర్వేలు, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది.

జిల్లా నుంచే కాకుండా రాష్ట్రానికి చెందిన పలువురు ఖమ్మం టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేశారు. టికెట్ ఆశావహుల్లో రాయల నాగేశ్వరరావుకు గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించడంతో ఆయన టికెట్ రేసు నుంచి తప్పుకొన్నారు. డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని టికెట్ విషయంలో కూడా భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. భట్టి విక్రమార్కకి స్వయాన సోదరుడు మల్లు రవికి నాగర్‌కర్నూల్ టికెట్ ఖరారు చేసింది. దీంతో నందినికి టికెట్ కేటాయింపు విషయంలో కాంగ్రెస్ నిర్ణయం ఎలా ఉండబోతుందో వేచి చూడాలి.

ఇక జిల్లాలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి , పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమ కుమార్, మాజీ మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వీవీసీ సంస్థల అధినేత వంకాయల పాటి రాజేంద్రప్రసాద్, కొత్తగూడేనికి చెందిన నాగసీతారాములు తదితరులు దరఖాస్తు చేశారు.

అయితే ఖమ్మం టికెట్ మూడో జాబితాలో ఉంటుందా.. నాలుగో జాబితాలో వస్తుందా అనే సస్పెన్స్ నెలకొంది.





మాసం సందర్భంగా ముస్లింల ఆధ్యాత్మిక భక్తి పారవశ్యం కొనసాగుతోంది. ఉపవాస దీక్షలతోపాటు మసీదుల్లో ప్రత్యేక నమాజులకు హాజరవుతున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఇళ్లవద్దనే రంజాన్ ప్రార్థనలు చేస్తున్నారు. - ఖమ్మం సాంస్కృతికం

మెడికోల నిరసనలు కొలిక్కొచ్చేనా..?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి22: ఎన్నో ఆశలతో వైద్య విద్యను అభ్యసించాలనుకున్న మెడికోల ఆశలు సాకారమయ్యేలా లేవు. పలు కారణాలతో ఆందోళనకు దిగిన విద్యార్థుల డిమాండ్లు పరిష్కరమయ్యే సూచనలు సమీపంలో కానరావడం లేదు. మొత్తం మూడు బృందాలు విచారణ నిర్వహించాయి. అయితే కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మధ్య అంతర్గత విబేధాలే సమస్యకు కారణమనే వాదన వినిపిస్తోంది.

పర్ణశాల వేలం పాటలు ఖరారు

దుమ్ముగూడెం, మార్చి 22: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పర్ణశాల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు జరిగాయి. వాహనపార్కింగ్ ఆశీలు వసూలు కోసం ఏడుగురు పోటీ పడగా, పొడియం వెంకటరమణ రూ.40లక్షలకు పాడి దక్కించుకున్నారు. బోటు షికారు పాటను సవలం భద్రయ్య రూ.42,40,000లకు అందరికంటే అధికంగా పాడారు. ఆలయం వద్ద మరుగుదొడ్ల నిర్వాహణను వాగే రాజేశ్వరి రూ.1.05లక్షలకు హెచ్చు పాటపాడారు. కాగా గతేడాది వేలం పాటల్లో వాహన పార్కింగ్ రూ.26.70లక్షలు, బోటు షికారు రూ.20.10లక్షలు, మరుగుదొడ్ల నిర్వాహణ రూ.65వేలు మాత్రమే పలకగా, ఈ ఏడు మూడు వేలం పాటలకు అధిక ధరకు పాడగా, పంచాయతీకి పెద్ద ఎత్తున ఆదాయం లభించింది.

నామినేషన్లలో నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 22: నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏఆర్‌ఓలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లతో నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు తదితర ఎన్నికల సంబంధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియలో అధికారుల పత్రాల పరిశీలన, అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలు, పాటించాల్సిన నియమ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నామినేషన్ల స్క్రూటిని, ఉపసంహరణ సందర్భంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

అధికారులకు కలెక్టర్ ప్రక్రియ పై సందేహాల నివృత్తి చేశారు. ఏఆర్‌ఓ లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలని వందశాతం సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట వెలుతురు వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రన్నింగ్ వాటర్ ఉండాలని, ఈ దిశగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని అన్నారు. కాంపౌండ్ వాల్ లేని చోట పోలింగ్ రోజున భద్రతా సమస్యలు తలెత్తవచ్చని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఒక లోకేషన్‌లో ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట, పోలింగ్ కేంద్రాలన్ని ఒకే బ్లాకులో ఉండకుండా చూడాలని, డిసెంట్రలైజేషన్, డిసెగ్రిగ్రేట్ చేయాలని, రద్దీ, క్యూ లైన్ల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలని, వారం రోజుల్లో చేయాల్సిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బృందాల పనితీరుపై ఏఆర్‌ఓ లు పర్యవేక్షణ చేయాలన్నారు. నిఘా బృందాల పనితీరు మంచి ఫలితాలు వచ్చేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

- డాక్టర్ గీత చల్లా



వీడియో కాన్ఫరెన్సులో సీఐ అంజలి

ఖమ్మంక్రైం, మార్చి 22: సమాజంలో ప్రతి మహిళను గౌరవించాలని సైకాలజిస్ట్ డాక్టర్ గీతా చల్లా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను వివిధ పద్ధతుల్లో వేధించిన బాధ్యులను గుర్తించి వారికి రాష్ట్ర మహిళ భద్రత విభాగం ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పిదాలు చేసిన బాధ్యుల్లో మార్పు తీసుకొచ్చే ఉద్దేశంతో ఆన్‌లౌన్ కౌన్సెలింగ్ చేపట్టామని అన్నారు. ఈకార్యక్రమంలో ఖమ్మం నుంచి సీఐ అంజలి, షీటీం బృందం పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



మాట్లాడుతున్న కాంతారావు

మణుగూరు , మార్చి 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమయిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. శుక్రవారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉండాలని భద్రాద్రి రాముడిని తాను వేడుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల వరకు కాంగ్రెస్ నివురు కప్పిన నిప్పులా ఉందని, ఎన్నికల తరువాత అధికారం కోసం అందులో నాయకులు బరితెగిస్తారని కుమ్ములాటలు మొదలు అవుతాయని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, ముత్యం బాబు, నవీన్, కుర్రి నాగేశ్వరరావు, జావెద్ పాషా, ఏనిక ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం

- టీడీపీ నేత డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

వైరా, మార్చి 22: మే 13న తెలంగాణలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తమకు శిరోధార్యమని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం స్పష్టంచేశారు. పార్టీ నిర్ణయాన్ని ప్రకటించేవరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. వైరా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం(ఎన్టీఆర్ భవన్)లో శుక్రవారం టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ టీడీపీ ఏపీలో ఎన్డీఏలో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. ఏపీలో ఎన్డీఏతో కలిసి ఉన్నందున తెలంగాణలో టీడీపీ ఇతర పార్టీలతో కలిసి వెళ్లటం ఎట్టి పరిస్థితుల్లో కుదరదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో వెలిబుచ్చిన అభిప్రాయాలను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తానని తెలిపారు. అప్పటివరకు ఎవరూ అధైర్యపడకుండా సంయమనం పాటించాలని సూచించారు. అధిష్ఠానం తీసుకునే నిర్ణయం మేరకు నడుచుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్రప్రభుత్వానికి కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర తెలుగు రైతుసంఘం అధ్యక్షుడు కాపా కృష్ణమోహన్, రాష్ట్ర నాయకుడు పోట్రు వెంకటరామారావు, వైరా, పాలేరు నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు చెరుకూరి చలపతిరావు, కొండబాల కరుణాకర్‌రావు, జిల్లా నాయకులు కేతినేని హరీష్, తాళ్లూరి అప్పారావు, ఆరెం రామయ్య పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ రామనాథం

భారతీయ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 22: విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. శుక్రవారం నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విదేశాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ రాబోయే కాలంలో మరింతగా సేవలందించాలని, ఇందుకు తాను సైతం సహకరిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో గత కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టి సమీక్షించారు. భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు బత్తిని నీరజ, ఉపాధ్యక్షులు వై. శ్రీనివాసరావు, దుగ్గి లక్ష్మి, రాయల రవికుమార్, నెల్లూరు వీరబాబు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

రైతుకు భరోసా

కొనసాగుతున్న యాసంగి పెట్టుబడి సాయం పంపిణీ

ఖమ్మం వ్యవసాయం, మార్చి 22: జిల్లావ్యాప్తంగా రైతుభరోసా సాయం పంపిణీ షురూ అయ్యింది. డిసెంబరు నెల రెండో వారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి రూ.5వేల చొప్పున ప్రభుత్వం నగదును జమ చేస్తున్నది. యాసంగి పంట పెట్టుబడి చేతికందుతుండడంతో అన్నదాతలు సంబురాలు చేసుకుంటున్నారు. డబ్బులు క్రెడిట్ అయిన మెసేజ్‌లను చూసుకొని మురిసిపోతున్నారు. ఎరువులు, కూలీల ఖర్చులు, ఇతర పనులకు అవసరమవుతాయని సంతోషం వ్యక్తంచేస్తూ ఉత్సాహంగా సాగుపనులకు వెళుతున్నారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం 3 లక్షల 42 వేల 803 మంది రైతుల మంది రైతులకు గాను రూ. 370.30 కోట్ల నగదు వారి ఖాతాలలో జమ చేయాల్సి ఉంది. అందులో ఇప్పటి వరకు 2లక్షల81వేల179మంది రైతులకు ప్రాధాన్యతను బట్టి రూ.200.27 కోట్లు పంపిణీ అయ్యాయి. తొలుత ఎకరం నుంచి ప్రారంభించి క్రమంగా ఎకరాల సంఖ్యను పెంచుతూ నగదును రైతుల ఖాతాలలో జమ చేస్తున్నారు.

రైతుబంధు పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేండ్లుగా అమలు చేస్తున్నది. ఏడాదికి ఎకరానికి రూ. పదివేల చొప్పున రెండు విడుతల్లో సాయాన్ని అందిస్తున్నది. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పూర్తి పారదర్శకంగా ఉండేందుకు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే సాయాన్ని జమ చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో ప్రస్తుతం పాత విధానంలోనే సాగు సాయం అందజేస్తున్నది. వచ్చే ఖరీఫ్ నాటికి కొత్త విధానంలో రూ. 15 వేలు జమ చేస్తారని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం..

ఏటా నవంబర్ నెలలో యాసంగి సీజన్ రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. అయితే ఈ ఏడాది రైతుబంధు డబ్బులు పడే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు డబ్బులు వేయవద్దని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. తర్వాత కొందరు రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల కమిషన్‌ను కోరగా.. డబ్బులు వేయాలని ఆదేశాలు వచ్చాయి. అయితే పలు కారణాల వల్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ క్రమంలో డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడి, అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. కాగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేయాలా.. పాత పద్ధతినే అనుసరించాలా అనే విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం తర్జనభర్జన పడింది. చివరికి యాసంగి సీజన్‌లో మాత్రం పాత విధానం ప్రకారమే రైతు బంధు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు

వైరా, మార్చి 22: రాష్ట్రంలో విద్యాశాఖ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను అమలులోకి తీసుకువచ్చింది. ఈనెల 12వతేదీన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న స్కూల్స్ మేనేజింగ్ కమిటీల(ఎస్ఎంసీ)తో ఎలాంటి సారూపిత లేకుండా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు కోసం ఈ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేస్తూ విద్యాశాఖ ఆదేశాలిచ్చింది.

ఖమ్మంజిల్లాలో 1216పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేసి మొదటి విడతలో 665పాఠశాలల్లో మౌళిక సౌకర్యాల కల్పన కోసం రూ.16కోట్ల, 61లక్షల, 55వేల నిధులను మంజూరు చేసింది. అన్ని ప్రభుత్వ జిల్లాపరిషత్, మండల ప్రజాపరిషత్ పాఠశాలల్లో మౌళిక సౌకర్యాల కోసం ఈ కమిటీలను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆగమేఘాల మీద ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఈనెల 15న అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఎంపికను పూర్తిచేశారు. ఈ కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు. ఆపాఠశాల పరిధిలోని గ్రామంలో ఉన్న స్వయం సహాయక గ్రూపు అధ్యక్షురాలు పాఠశాల చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఈ కమిటీకి వ్యవహరిస్తారు.

ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు ఐదు తరగతులకు కలిపి మొత్తం 15మంది కమిటీ సభ్యులుగా ఉంటారు. ఒక్కో తరగతిలో ఉండే ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ లేక ఎస్టీ అయి ఉండాలి. వీరందరిని చైర్మన్ అలాగే కన్వీనర్ ఇద్దరు కలిసి నామినేట్ చేస్తారు. విద్యార్థి తరగతి మధ్యలో వెళ్లిపోతే కొత్తవారిని మళ్లీ తీసుకోవాలి. అయితే ఈ కమిటీ చైర్మన్ పిల్లలు పాఠశాలలో చదువుతుండాలి అనే నిబంధనలకు సంబంధించి స్పష్టత లేదు. ఒకవేళ ఆగ్రామంలో ఒకే వీవో ఉండి పాఠశాలలు ఎక్కువగా ఉన్నట్లయితే ఆ వీవో అన్ని పాఠశాలలకు చైర్మన్‌గా ఉంటారు. ఒకవేళ ఒక గ్రామంలో ఇద్దరు వీవోలు ఉండి పాఠశాల ఒకటే ఉన్నట్లయితే వారిలో ఒకరు ఒక సంవత్సరంపాటు చైర్మన్‌గా ఉంటారు. మిగతావారు రెండో సంవత్సరం చైర్మన్‌గా ఉంటారు.

ఈ కమిటీల ఆధ్వర్యంలో విధిగా పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలు కల్పించాలి. బాలికల టాయ్‌లెట్స్, తాగునీరు, టాయ్‌లెట్స్ పునర్నిర్మాణం, మేజర్, మైనర్ రిపేర్లు, పారిశుధ్యం, పాఠశాల నిర్వహణ మొత్తం విద్యార్థుల యూనిఫాం కుట్టు కూలీ కింద కమిటీ నుంచి వచ్చే నిధులను ఖర్చుచేయాల్సి ఉంటుంది. మండలాలవారీగా నిధులు మంజూరైన పాఠశాలల వివరాలిలా ఉన్నాయి.బోనకల్ మండలంలో 28 పాఠశాలలు, చింతకానిలో 28, ఏన్కూరులో 18, కల్లూరులో 36, కామేపల్లిలో 28, ఖమ్మం రూరల్ మండలంలో 32, ఖమ్మం అర్బన్‌లో 43, కొణిజర్లలో 24, కూసుమంచిలో 37, మధిరలో 33, ముదిగొండలో 34, నేలకొండపల్లిలో 27, పెనుబల్లిలో 38, రఘునాథపాలెం మండలంలో 37, సత్తుపల్లిలో 37, సింగరేణిలో 36, తల్లాడలో 26, తిరుమలాయపాలెంలో 34, వేంసూరులో 33, వైరాలో 23, ఎర్రుపాలెంలో 33 పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కింద రూ.16కోట్ల, 61లక్షల, 55వేల నిధులు మంజూరయ్యాయి.

టీజీ నెంబర్ ప్లేట్లు.. ఏవీ?

- రిజిస్ట్రేషన్‌కే పరిమితమైన వాహనాలు
- ఐదు రోజుల్లో 500 మంది నిరీక్షణ
- కార్డుల కోసం కూడా ఎదురు చూపు
- వారంలోపు కార్డులు అందుబాటులోకి: డీటీవో

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 22: కొత్త వాహనం కొనుగోలు చేసిన తర్వాత నచ్చిన నెంబర్‌ను వాహనానికి అంటించుకొని రోడ్డెక్కితే ఆ అనుభూతే వేరు. వాహన నెంబర్ సీరియల్ కోసం వాహనాల కొనుగోలును నెలల తరబడి వాయిదా వేసుకొనే వారెందరో ఉంటారు. కోరుకున్న ఫ్యాన్సీ నెంబర్ కోసం ఎన్ని డబ్బులు పెట్టడానికైనా వెనకడుగు వేయని వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. పుట్టిన తేదీ, పెళ్లి రోజు, ప్రత్యేక గుర్తింపు గుర్తింపు నెంబర్ల కోసం వాహనాల రిజిస్ట్రేషన్ల సమయంలో పోటీ ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఈదంతా ఎందుకు అంటారా..



కంటికి కనిపించని టీజీ కార్డులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల మేరకు వాహన రిజిస్ట్రేషన్లు టీఎస్ నుంచి టీజీకు మార్పు చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి ఖమ్మం జిల్లాలో టీజీ04 0001నెంబర్ నుంచి వాహన రిజిస్ట్రేషన్లు నమోదు ప్రారంభమైంది. మొదటి రోజు నుంచి అనూహ్య ఆదరణ లభించింది. రవాణాశాఖకు అధికంగా కాసుల వర్షం కురిసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఉదయం వాహనం రిజిస్ట్రేషన్ జరిగితే సాయంత్రానికి వాహన నెంబర్ కార్డు పొందితే ఆ సంతోషం చెప్పాల్సిన పనిలేదు. కాని రాష్ట్ర వ్యాప్తంగా టీజీ నెంబర్ ప్లేట్స్‌తో రిజిస్ట్రేషన్ కార్డులు ప్రక్రియ పూర్తి కాకపోవటంతో ఖమ్మం జిల్లాలో ఆ ప్రభావం కనిపిస్తోంది.

గత ఐదు రోజులుగా కొత్త వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఫ్యాన్సీ నెంబర్ల కోసం రూ.లక్షలు వచ్చించిన వారు సైతం తమ వాహనాల రిజిస్ట్రేషన్‌కార్డులను కంటితో చూడలేక పోయారు. ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా టీజీ పేరుతో కార్డులు జారీ ప్రారంభం కాలేదు. దీంతో నూతన వాహనదారుల్లో ఉత్సాహం తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన టీజీ నెంబర్ ప్లేట్స్ విడుదల చేయాలని కోరుతున్నారు.

పూర్తికాని ప్రక్రియ..

రాష్ట్ర రవాణాశాఖ నుంచి ఇంకా టీజీ నెంబర్ కార్డులు ప్రక్రియ పూర్తి కాలేదని జిల్లా రవాణాధికారి సిద్ధిఖి తెలిపారు. అందుకే జిల్లాలో పంపిణీ జరగటం లేదన్నారు. మరో వారం రోజుల్లో నూతన కార్డులు, ప్లేట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నీటి వినియోగం, ఆవశ్యకతపై అవగాహన

కల్లూరు, మార్చి 22: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కల్లూరులో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీటి వినియోగం, పక్షులను ఎలా ఆదరించాలి వాటి ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణవేత, జేవీఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నీటిని ఏ విధంగా వినియోగించాలి దాని ఆవశ్యకత, బయోడైవర్సిటీ అంశాలపై, పశుపక్షాదులు, రాబందులు ప్రకృతిలో జీవించినట్లయితే మానవ మనుగడకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కప్పలు లేని కారణంగా డెంగ్యూ వ్యాధులు వస్తున్నాయన్నారు. నీటి ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు నీటి ఆవశ్యకతకు సంబంధించిన బ్రోచర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వీరరాఘవయ్య, జె నాగలక్ష్మి ఎం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కోర్టు న్యాయాధికారిగా శ్రీనయ్య

ఖమ్మం లీగల్ మార్చి 22: ఖమ్మం మహిళా కోర్టు న్యాయమూర్తిగా వి. శ్రీనయ్యను నియమిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ న్యాయాధికారిగా రాంప్రసాద్‌రావు పనిచేస్తున్నారు.

మధిర బార్‌కు నాలుగు పదవులు ఏకగ్రీవం

మధిర, మార్చి 22: మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. అధ్యక్ష పదవికి బోజెడ్ల పుల్లారావు, ప్రధాన కార్యదర్శి పదవికి కోట జ్ఞానేష్, ఉపాధ్యక్ష పదవికి జే రమేష్, కోశాధికారి పదవికి కె విజయ్‌కుమార్ నామినేషన్‌లు మాత్రమే ఉండటంతో నాలుగు పదవులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నిక అధికారి సీ గోపాల్ తెలిపారు. సహాయకార్యదర్శి పదవికి భైరవభట్ల వెంకట రమణారావు, పుట్టా శ్రీనివాసరావు పోటీ పడటంతో ఈపదవికి 28న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గొరిల్లా వేషం.. కోతులు పరార్..



బూర్గంపాడు, మార్చి 22: గ్రామంలో రోజురోజుకూ పెరిగిపోతున్న కోతుల బెడద నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు ఆ పంచాయతీ సెక్రటరీ వినూత్నంగా ఆలోచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉండేది. వాటి నుంచి తమకు విముక్తి కల్పించాలంటూ పంచాయతీ సెక్రటరీ భవానికి ప్రతిరోజూ గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వచ్చేవి. కోతులను పట్టి అడవుల్లో వదిలేసినా మళ్లీ గ్రామంలోకి వచ్చేవి. దాంతో కొత్త ఉపాయం కోసం పంచాయతీ సెక్రటరీ భవాని ఆన్‌లైన్‌లో శోధించారు. యూట్యూబ్‌లోని ఓ వీడియోలో గొరిల్లా వేషధారణలోని వ్యక్తిని చూసి కోతులు పారిపోవడం ఆమెకు కనిపించింది. దాంతో వెంటనే ఆమె అమెజాన్‌లో ఆర్డర్ చేసి రూ. 7300 విలువైన గొరిల్లా దుస్తులను తెప్పించారు. పంచాయతీలో పని చేసే కార్మికుడు రాములుకు గొరిల్లా వేషధారణ చేయించి, గ్రామంలో తిప్పడం మొదలు పెట్టారు. రాములును నిజమైన గొరిల్లాగా భ్రమించి కోతులు పారిపోతున్నాయి. గొరిల్లా వేషం దెబ్బకు కోతుల బెడద తీరడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. పంచాయతీ సెక్రటరీ భవానీ ఆలోచనను అందరూ ప్రశంసిస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
శనివారం 23 మార్చి 2024

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి: జడ్పీ సీఈవో


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

చింతకాని, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలని జడ్పీ సీఈవో వినోద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలతో పాటు గ్రామాల్లో అమలవుతున్న ఎన్నికల నిబంధనలు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎంసీసీ అధికారులు పల్లెల నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో జాబ్‌మేళా

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 22: ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రముఖ ఈ లెర్నింగ్ కంపెనీ ఎడ్వేదాకు తమ కళాశాల నుంచి 59మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీటీ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈడ్రైవ్‌లో మొత్తం 276మంది విద్యార్థులు పాల్గొనగా 59 మంది ఉద్యోగాలు సాధించినట్టు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

తల్లాడ, మార్చి 22: వచ్చే ఏడాది నాటికి తెలంగాణలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని అందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీకాంత్ కోరారు. శుక్రవారం తల్లాడ మండలం బాలపేట గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించిన అనంతరం టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి స్వచ్ఛందంగా ముందుకొచ్చి టీబీ వ్యాధి లక్షణాలున్న వారు కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కర్, సూపర్‌వైజర్‌లు కె.పెద్దపుల్లయ్య, వై.సురేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఏఎన్ఎం అమృతరాజు, ల్యాబ్ టెక్నీషియన్ ధనకొండ కృష్ణారావు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 22: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిరోధించాలని, ఒక పథకం ప్రకారమే ఇజ్రాయిల్‌పై దాడులు జరుగుతున్నాయని సీపీఐ జిల్లా నాయకులు మహ్మద్ సలామ్ ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలో ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 22: ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఖమ్మం డీపో ఆర్ఎం వెంకన్న నూతన బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆర్ఎం వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు వేసవికాలంలో ఎండ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించాలి

» ఖమ్మం ఆర్డీవో గణేష్


మాట్లాడుతున్న ఆర్డీవో గణేష్

బోనకల్/కొణిజర్ల/చింతకాని మార్చి 22: ఓటుహక్కు పట్ల ప్రజల్లో చైతన్యం పెంచేలా కృషి చేయాలని ఆర్డీవో గణేష్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలింగ్ నిర్వహణ పట్ల రెవిన్యూ సిబ్బందితో ప్రత్యేక స మావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించేలా చూడాలని సూచించారు. ఓటర్లను ప్రలోబాలకు గురి కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి ఫిర్యాదులను సీ విజిల్ యాప్‌లో చేయాలని కోరారు. కొత్తగా నమోదైన ఓటర్లకు ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యతను వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో లకావత్ రాజు, గిర్దావర్ లక్ష్మణ్, ఏసీడీపీవో వీరభద్రమ్మ పాల్గొన్నారు.

ఓటు ప్రతి పౌరుడి బాధ్యత: తహసీల్దార్

కొణిజర్ల: 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తమ ఓటుహక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకులు ఆన్‌లైన్ ద్వారా ఫామ్-6ను పూర్తి చేసి తమ ఓటును రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన మనకు ఇచ్చిన హక్కు అని దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్‌కుమార్, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ చిన్నయ్య పాల్గొన్నారు.

చింతకాని: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎస్ఐ నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



వేంసూరు, మార్చి 22: వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి 9.25గంటలకు వేంకటేశ్వరస్వామి సమేత రాజ్యలక్ష్మీ అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించటంతోపాటు కల్యాణమండపాన్ని రంగులతో తీర్చిదిద్దారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే తెలంగాణ, ఏపీ రాష్ట్రాల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాటుచేశామని ఆలయ ఈవో నర్సింహారావు తెలిపారు.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

» కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

» ఘనంగా శ్రీ చైతన్యోత్సవ్-24


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం రూరల్, మార్చి 22: ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని అలవరుచుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. ఖమ్మం రూరల్ మండలం, పొన్నేకల్లు పరిదిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన శ్రీ చైతన్యోత్సవ్-24 ముగిసింది. కార్యక్రమాలలో శ్రీ చైతన్యతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి పరిస్థితులైన తట్టుకుని ఉత్తమ పౌరులుగా నిలబడాలన్నారు. సామాజిక మధ్యమాలలో మంచిని గ్రహించి చెడును వదిలివేయాలన్నారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతు శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రస్తానం 25 సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. ఇంటర్మీడియట్ నుంచి ఇంజనీరింగ్ రంగంలోకి ప్రవేశించామన్నారు. ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ఆధ్వర్యంలో విద్యార్థులు పాటలు పాడుతు డ్యాన్స్‌లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే టిల్లు తదితర ఉర్రుతలూగించే పాటలతో కళాశాల ప్రాంగణం సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, డైరెక్టర్ శ్రీ విద్యా, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి, సీఈవో శ్రీనివాస్, డీజీఎం చేతన్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థినుల డ్యాన్స్

నేడు మధర్‌థెరిస్సా కళాశాల వార్షికోత్సవం


స్టాల్స్ పరిశీలిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లి, మార్చి22: నేడు మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో కార్నివాల్ నిర్వహించగా జూక్‌బాక్స్ ద్వారా వ్యాపార రంగాలలో ఎలా రాణించాలో వివిధ ఫుడ్ ఐటమ్స్‌లతో రుచి చూపించి మరీ విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కొత్తూరు ప్రభాకరరావు, డైరెక్టర్లు డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, కొత్తూరు సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జే.కుమార్ రాజా, డాక్టర్ ఎల్‌వీఆర్.దీక్షితులు, ఎం.అజయ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లూస్టార్ ఎక్స్‌క్లూజివ్ షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభిస్తున్న ఏఆర్‌కే ప్రసాద్

ఖమ్మం వ్యవసాయం, మార్చి 22: ప్రముఖ ఏసీ కంపెనీ బ్లూస్టార్ ఎక్స్‌క్లూజివ్ షారూంను కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రీజినల్ మేనేజర్ ఏఆర్‌కే ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్‌లో స్వాతి ఎంటర్ ప్రైజస్ బ్లూస్టార్ షోరూంను ఏర్పాటు చేశారని అయన అన్నారు. ఏసీకి సంబంధించిన అన్ని పరికరాలు ఉంటాయని తెలిపారు. ఫ్రిజ్‌లు, ఏసీలలో నెంబర్ 1 అని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఖమ్మం నూతన బ్రాంచ్ అధినేత ధనాల ప్రసాద్, డాక్టర్ ధనాల స్వాతి, సుగుణ ఆసుపత్రి అధినేత డాక్టర్ సుగుణ, కంపెనీ బ్రాంచ్ మేనేజర్ యూసుఫ్, సేల్స్ మేనేజర్ స్వప్నిల్, ప్రముఖులు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, మండడపు రామకృష్ణ, ధనాల శ్రీనివాస్, కార్పొరేటర్లు మాదూరి ప్రసాద్, పాకాలపాటి శేషగిరి చిరుమామిళ్ల నాగేశ్వరావు, సరిపూడి సతీష్, కమర్తపు శ్రీధర్, ఖాదర్, బత్తుల మురళి, శివ, అఫ్జల్ జర్నలిస్టు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళితో ప్రసాద్

బాల్య వివాహాలను అరికట్టాలి: తహసీల్దార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

బోనకల్, మార్చి 22: బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను అరికట్టేలా కృషి చేయాలని తహసీల్దార్ పున్నం చందర్ సూచించారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో శుక్రవారం ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలలకు జీవించే హక్కుతో పాటు హక్కుల కొరకు రక్షణ కల్పించాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల గురించి సమాచారం తెలిస్తే చైల్డ్‌లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098 లేదా 100ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. బాలలకు విద్య ప్రాథమిక హక్కుగా గుర్తించి ఎలాంటి ఆటంకాలు లేకుండా చదువులను కొనసాగించేలా చూడాలన్నారు. చదువులు మానేసి బాల్యంలో పనులు చేస్తే జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. బాల్య వివాహాల కలిగే నష్టాలను వివరించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి దామాల పుల్లయ్య, వైద్యాధికారి స్రవంతి, స్వచ్ఛంద సంస్థ కో ఆర్డీనేటర్ బోయినపల్లి సురేష్, సూపరిడెంట్ నరేందర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలకు ప్రత్యేక నిధులు: ఎంపీడీవో



కొణిజర్ల, మార్చి 22: పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించిందని ఎంపీడీవో రోజారాణి తెలిపారు. ఈ నిధులతో పోలింగ్‌కేంద్రాలలో తాగునీరు, మహిళా సిబ్బంది ఇబ్బంది పడకుండ టాయిలెట్స్, విద్యుత్, శానిటేషన్, తదితర సమస్యలు తలెత్తకుండ చూడాల్సి ఉంది. గత ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బంది కరెంట్ సక్రమంగాలేదని, బాత్‌రూమ్‌లలో నీటి సౌకర్యంలేదని తదితర అంశాలపై ఇబ్బందులు పడినట్లు తెలిసింది. ఆ ఉద్దేశంతోనే ఎవరూ ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించింది. పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించే లక్ష్యంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కొణిజర్ల మండలానికి రూ. 56.45 లక్షలు

పోలింగ్‌కేంద్రాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కొణిజర్ల మండలానికి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు రూ.56.45 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో కొణిజర్ల మండలంలోని పోలింగ్‌కేంద్రాలతో పాటు వైరా మునిసిపాలిటిలో కలిసిన పల్లిపాడు, దిద్దుపుడి, లాలాపురం, శాంతినగర్ పోలింగ్‌కేంద్రాలలో కూడ వసతులను కల్పించనున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రోజారాణిని నిధులపై అడగగా పోలింగ్‌కేంద్రాలకు ప్రభుత్వం నిధులు కెటాయింపు చేసిందని, ప్రతి పోలింగ్‌కేంద్రంలో ఎన్నికల నిబందనల ప్రకారం సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ సౌకర్యంను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 22: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మంనగరంలో విస్తృతంగా పర్యటించారు. పలు శుభ కార్యాలయాల్లో పాల్గొన్నారు. ఎంఎఆర్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. గంధం శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి: సీపీఐ


మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వైరా, మార్చి 22: మునిసిపాలిటీలోని కార్మికులకు పెండింగ్, ప్రస్తుత వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం వైరా మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణుకు ఒక వినతిపత్రం సమర్పించారు. వెంటనే వేతనాలు చెల్లించి ఆరోగ్యరక్షణ పరికరాలు అందించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఏఐటీయూసీ మునిసిపల్ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు హెచ్చరించారు. మునిసిపల్ కార్మికులతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందించిన అనంతరం వారు మాట్లాడారు. నాయకులు గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, కొండా రామకృష్ణ, దొబ్బల కృష్ణ, మోటా కొండ, షేక్.షరీఫ్, రాయపూడి శ్రీను, రాజేష్, నమ్మయ్య, కోపిల కవిత, సామ్రాజ్యం పాల్గొన్నారు.

శిశు మరణాలను నియంత్రించాలి: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 22: భద్రాద్రి జిల్లాలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల వరకు మరణాల రేటును నియంత్రించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష వైద్యాధికా రులను కోరారు. శుక్రవారం ఐడిఓసిలోని డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యావసర సమావేశంలో డిస్ట్రిక్ చైల్డ్ డెత్ కమిటీ సభ్యులతో మాట్లాడి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సం వత్సరంలో జనవరి, ఫిబ్రవరి నెలలో ఐదు సంవత్సరాల లోపు పిల్లల మర ణాలు, వాటి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిశు మరణాల రేటును తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భస్థ శిశువు నుంచి 5 ఏళ్ళ పిల్లల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులకు వివరించారు. ఈ సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ కోరశ్రీ యాదవ్, డాక్టర్ పుష్పలత, డాక్టర్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు ఉపాధి కల్పించాలి: ఏఐపీకేఎంఎస్

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 22: గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని కారణంగా ఉపాధి హామి పథకం పనులను 200రోజులు పాటు కల్పిస్తూ రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల కిసాన్ మజ్దూర్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ శివలింగం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు బందెల వెంకయ్య, కంకణాల అర్జున్‌రావు, బీరెల్లి లాజర్, ఆవుల మంగతాయి, తిమ్మిడి హనుమంతరావు, వీర్ల వెంకట అప్పారావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కూరాకుల నర్సయ్య, చల్లా రాజు పాల్గొన్నారు.

అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న మోదీ: కాంగ్రెస్

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 22: ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక విలువలు కలిగిన దేశంగా ఉన్న భారతదేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోది ఆ ప్రజాస్వామికంగా వ్యవహరిస్తు ప్రపంచ దేశాల ఎదుట భారత్‌ను దోషిగా నిలబెట్టే కుట్ర చేస్తున్నారని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం మయూరిసెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోది దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కూడా ఇండియా కూటమిని ఓడించలేదని పేర్కొన్నారు. నాయకులు దయ్‌కిరణ్, బోల్లం మహేష్, తొమాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న విజయనర్సింహారెడ్డి

పెనుబల్లి, మార్చి 22: రాజసాయి మందిరం, ఖమ్మం మమత హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పెనుబల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని రాజసాయి మందిరం నిర్వాహకుడు జన్నారెడ్డి విజయనర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరానికి వివిధ ప్రాంతాలకు చెందిన 350మంది రోగులు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన 125మందిని రెండు దఫాలుగా ఖమ్మం మెడికల్ కాలేజీకి తరలించనున్నట్లు మందిరం చైర్మన్ జన్నారెడ్డి విజయనర్సింహారెడ్డి, మమత హాస్పిటల్స్ డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌లు కె.సాయి అభినందన్, సాయితేజ, మానస, సదానందం, పెనుబల్లి వైద్యురాలు కె.ప్రశాంత్‌తోపాటు బి.వాసు, గోపి, సైదమ్మ, మౌనిక, కుమారి, వంగా నిరంజన్, షేక్.చాంద్‌సాహెబ్, శ్రీను, నర్సింహారావు, శ్యామల, శిరీష, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి: కలెక్టర్


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కూసుమంచి, మార్చి 22: పల్లె దవాఖానాలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మండలంలోని జుజ్జులరావుపేట గ్రామంలో పల్లె దవఖానా ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు షుగర్, బీపీ వ్యాధి గ్రస్తులకు ప్రతినెల మందులు ఇవ్వాలన్నారు. పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈడీడీ ఛార్ట్ ప్రదర్శించాలన్నారు, గర్భిణీలకు అవసరమైన పరీక్షలు చేయించాలన్నారు. పేదప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మండలంలోని నాయకన్‌గూడెం, ఈశ్వరమాధారం, రాజుపేట, పెరికశింగారం, జుజ్జులరావుపేట పాఠశాలలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్‌కేంద్రాల్లో తాగునీరు, కరెంట్, టాయ్‌లెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరధ నీటిసరఫరా లేనిచోట ప్రత్నామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లోకి కల్లూరు బీఆర్ఎస్ ముఖ్యనేత?

» త్వరలో మంత్రి పొంగులేటి సమక్షంలో చేరికకు రంగం సిద్ధం » అనుచరులతో సమావేశం

కల్లూరు, మార్చి 22: కల్లూరులో బీఆర్ఎస్‌లో రాజకీయంగా కీలక చక్రం తిపుతున్న ఓ కీలకనేత తన అనుచరులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మారుతున్న రాజకీయ పరిమాణాల నేపద్యంలో సదరు నేత త్వరలో తన అనుచరగణంతో కాంగ్రెస్‌లో చేరే విషయమై అభిప్రాయ సేకరణ కూడా చే శారు. ఆయన అనుచరగణం, అభిమానులంత కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపారని సమాచారం. ఈ సమావేశానికి పుల్లయ్యబంజరు. లోకవరం, కల్లూరులో గల ఆ నేత అభిమానులు, అనుచరులు పాల్గొని రాజీకంగా మీరు తీసుకోనే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారని సమాచారం. సదరు నేత మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటవీరయ్యతో రాజకీయంగా సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తరుపున గెలుపు కోసం పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత రాజకీయంగా బీఆర్ఎస్ స్తబ్ధతతో ఉండటంతో తిరిగి కల్లూరులో తన రాజకీయ ప్రాబల్యంను కాపాడుకునే ప్రయత్నంలో సదరు నేత పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నట్టు సమాచారం. అందులో బాగంగానే సమావేశం నిర్వహించినట్టు సమాచారం. అయితే ఏ పార్టీలో చేరేది బాహాటంగా నిర్ణయించలేదు. అనుచరుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోని తన రాజకీయ భవిషత్తు అధార పడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారని తెలిసింది. ఇదిలా ఉండగా కల్లూరు మం డలం నుంచి మంత్రిగా కాంగ్రెస్‌లో రాజకీయంగా చక్రం తిప్పుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో త్వరలో ఆయన కాంగ్రెస్ తీర్థం చేరేందుకు సిద్ధమవుతున్నట్టు సమచారం. భవిషత్తులో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ తరుపున అభ్యర్థులను బరిలో దించి సత్తా చాటేందుకు కూడా వెనుకడుగు వేసే ప్రసక్తేలేదని ఈ సమావేశంలో ఆ నేత రాజకీయ శపథం కూడా చేశారని సమాచారం.

అమరవీరలు ఆశయాలు సాధించాలి: సీపీఎం

తిరుమలాయపాలెం, మార్చి 22: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమింవచి అసువులు బాసిన అమరవీరుల ఆశయాలు సాధించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను కోరారు. శుక్రవారం మండలంలోని పాపాయిగూడెంకు చెందిన సీపీఎం సీనియర్ నాయకులు రేపాకుల వీరస్వామి సంస్మరణ సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ వీరస్వామి ఈప్రాంతంలో కమూయనిస్టు పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. నిరుపేదలు కష్టాల్లో ఉంటే వారిని ఆదుకునేవారన్నారు. వారి ఆశయ సాధనకు అందరం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వశపొంగు వీరన్న, కొలిచలం స్వామి, రేపాకుల నారాయణ, వెంకన్న, సత్యనారాయణ, అంగిరేకులు నరసయ్య, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

» ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 21: ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముస్తాఫనగర్ పార్కీబంధం ప్రాంతంలో శుక్రవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ ఆర్.పుష్పలత హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. పిల్లలకు సరైన పోషకహారం అం దించాలన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, ఆరునెలల పిల్లల కు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు సీహెచ్.అంజలి, బి.సునిత, ఆర్.కృష్ణకుమారి పాల్గొన్నారు.

●వేంసూరు: మండలంలోని అడసర్లపాడు గ్రామంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ నిర్వహించారు. సీడీపీవో కొండమ్మ ఆార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.పద్మ, ఎం.విజయకుమారి, ఎల్.షాలిని, పి.వెంకటమ్మ, వి.నిర్మల, మధురవాణీ, జయమ్మ పాల్గొన్నారు.

●కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న పోషకాహార సేవలను వినియోగించుకోవలని కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కృష్ణకుమారి కోరారు. శుక్రవారం మండలంలోని బత్తుల పల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరువంచ సెక్టార్ సూపర్వైజర్ భవానీ, అంగనవ్వాడి టిచర్లు శ్రీదేవి, అరుణాగాంధీ, జహిదాబేగం, రాజేశ్వరీ, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండలం మల్లవరం అంగన్‌వాడీ కేంద్రం-4లో పోషణ పక్షోత్సవాన్ని ఐసీడీఎస్ కల్లూరు సీడీపీవో కృష్ణకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మెహరున్నీసాబేగం, అంగన్‌వాడీ టీచర్ మేడి సుభాషిణి పాల్గొన్నారు.

●తిరుమలాయపాలెంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో బాలిత్రిపుర సుందరి, ఏసీడీపీవో ఉదయశ్రీ, ఏసీడీపీవో కనకదుర్గ, సూపర్‌వైజర్లు బక్కమ్మ, ప్రసూన, పర్వీన్, లక్ష్మి, పార్వతమ్మ, రత్నకుమారి, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


తల్లాడలో మాట్లాడుతున్న సీడీపీవో